# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 25 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## పాకిస్తానీయులకు వీసా సేవలు నిలిపివేత




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పహల్‌గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం పాకిస్థాన్ పౌరులకు ఇచ్చే వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది. మెడికల్ వీసాలు సహా,ఇప్పటికే పాక్ పౌరులకు జారీ చేసిన అన్ని రకాల వీసాలను రద్దు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈవిషయాన్నిగురువారం విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.ఇప్పటికే వీసాలు పొందినవారికి ఈ నెల 27వ తేదీ వరకు గడువు విధించినట్లు స్పష్టం చేసింది. అయితే మెడికల్ వీసాలు కలిగిన వారికి మాత్రం కొంత ఊరటనిచ్చింది.వారికీ ఈ నెల 29వ తేదీ వరకు గడువు ఇచ్చింది. వీసా గడువు ముగిసేలోపు భారత్‌ను తప్పనిసరిగా వదిలి తమ స్వదేశాలకు వెళ్లిపోవాలంటూ కేంద్రం ఆదేశించింది.

# నేటి నుంచి భారత్ సమ్మిట్

- 450 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు
- రాహుల్ గాంధీ ఆలోచన మేరకే ఈ సమ్మిట్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- నేడు, రేపు హెచ్ఐసీసీలో నిర్వహణ
- 100 దేశాలకు చెందిన 300 మంది ప్రతినిధుల రాక



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించబోయే భారత్ సమ్మిట్ లో వంద దేశాలకు సంబంధించిన 450 ప్రతినిధులు పాల్గొంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. భారతదేశం అలీనోద్యమం తీసుకొని ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని, ఆ దిశగానే సమ్మిట్ నిర్వహిస్తున్నామన్నారు భట్టి విక్రమార్క. గురువారం హెచ్ఐసీసీ నుంచి మాట్లాడిన భట్టి విక్రమార్క.. ' రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. ఉదయం గం. 7.30ని.ల నుంచి గం.10.30 ని.ల వరకూ ఎన్ఆర్జీసీ పథకం ఫీల్డ్ విజిటింగ్ చేస్తాం. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం వివరిస్తాం. 2:45 నుంచి 4 గంటల వరకు తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్ కోసం ఏం చేస్తుందనేది వివరిస్తాం. వివిధ దేశాల మధ్య యుద్ధాలు జరుగుతున్న సమయంలో శాంతిని నింపేందుకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుంది.

శనివారం సాయంత్రం ఇందిర మహిళ శక్తి బజార్ శిల్పకళ వేదిక సందర్శిస్తాం. పెహల్గామ్ ఉగ్రదాడి దురదృష్టకర సంఘటన. ఈ ప్రాంతాన్ని రేపు రాహుల్ గాంధీ సందర్శిస్తారు. అనంతరం భారత్ సమ్మిట్ కి రాహుల్ గాంధీ హాజరు అవుతారు. అహింస, సత్యాగ్రహ పద్ధతి ప్రపంచం పాటించాలని కోరుకుంటున్నాం. భారత్ సమ్మిట్ ద్వారా వివిధ దేశాల ప్రతినిధులు తెలంగాణకి వస్తారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న వనరుల వివరిస్తాం. న్యాయం అన్ని వర్గాలకు దక్కాలనేది కాంగ్రెస్ మూల సిద్ధాంతాలు. మా ప్రభుత్వం ద్వారా ప్రపంచానికి ఈ మూల సిద్ధాంతం తెలియజేస్తాం. ప్రగతిశీల భావజాలం ఉన్న, న్యాయ సిద్ధాంతం ఉన్న పార్టీలను ఈ సమ్మిట్ కి ఆహ్వానిస్తాం' అని భట్టి పేర్కొన్నారు. భారత్ ఫౌండేషన్ సహకారంలో ఈ నెల 25, 26వ తేదీల్లో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ)లో భారత్ సమ్మిట్ 2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

హెచ్ఐసీసీ నోవాటెల్‌లో జరగనున్న భారత్ సమ్మిట్‌కు సంబందించిన ఏర్పాట్లను ఏఐసీసీ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పరిశీలించారు. సమ్మిట్ థీమ్ పోస్టర్లు, స్టాళ్లను తిలకించారు. వీరివెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షులు బి.మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీకార్యదర్శి గురుదీప్ సింగ్ సప్పల్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉగ్రవాదంపై పోరులో

# ప్రభుత్వం వెన్నంటే ఉంటాం

- ప్రతిపక్ష పార్టీలు
- ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటాం
- కేంద్ర ప్రభుత్వం
- పహల్గాం ఉగ్రదాడిపై ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం
- పహల్గామ్ మృతులకు అఖిలపక్షం నివాళులు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పార్లమెంట్ భవనంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం అఖిలపక్ష సమావేశం భేటీ జరిగింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ జరిగింది. 2 గంటలకుపైగా సమావేశం కొనసాగింది. పహల్గామ్ మృతులకు అఖిలపక్షం నివాళులర్పించింది. నేతలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఉగ్రదాడి అనంతరం తీసుకున్న చర్యలపై అఖిలపక్షానికి కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఉగ్రదాడుల్ని ఎదుర్కోవడంలో ఆయా పార్టీల సలహాలను కోరింది.ఉగ్రవాదంపై కఠిన చర్యలు ఉంటాయని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడిపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు.

'జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడడం, టూరిజం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన తర్వాత తీసుకున్న చర్యలను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారు' అని కిరణ్ రిజిజు తెలిపారు.

ఉగ్ర దాడులను అఖిలపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. కశ్మీర్‌లో శాంతి నెలకొనాలని.. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా సమర్థిస్తామని రాహుల్ గాంధీ అన్నారు. ఈ సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా ఇతర పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నేతలు హాజరయ్యారు.

రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, బీజేపీ చీఫ్, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, విదేశాంగ మంత్రి జైశంకర్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేలతోపాటు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలు పాల్గొన్నారు.

## పహల్గామ్ ఉగ్రవాదులిద్దరూ పాక్ జాతీయులే

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



పహల్గామ్ ఉగ్రదాడులలో ప్రత్యక్షంగా పాల్గొన్న ముగ్గురిలో ఇద్దరు పాకిస్థానీ జాతీయులు అని భద్రతా బలగాలు ప్రాథమికంగా గుర్తించాయి. ఉగ్రవాదుల నమూనా రూపాలను తెలిపే స్కెచ్‌లను జమ్మూ కశ్మీర్ పోలీసులు ఒక్కరోజు క్రితమే విడుదల చేశాయి. ఆచూకిని తెలిపే సమాచారం అందించిన వారికి రూ 20 లక్షల రివార్డును ప్రకటించారు. పహల్గామ్ దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు ఉగ్రవాదులే కీలక పాత్ర పోషించారని పసికట్టారు. ఈ ఇద్దరు ఉగ్రవాదుల గుర్తింపు వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇద్దరిలో ఒక్కరు హాషీం మూసా అలియాస్ సులేమాన్ మరొక్కడు అలీ భట్ అలియాస్ తహా భట్ అని అధికారులు తెలిపారు. ఇక మూడో టెర్రరిస్టు జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌కు చెందిన అబ్దుల్ హుస్సేన్ థోకర్ అని గుర్తించారు. ఈ వ్యక్తి భారతీయ పౌరుడు.



## ఉగ్రవాదుల దాడులను ఖండిస్తున్నాం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జమ్ము కశ్మీర్ పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి పలువురు మంత్రివర్గ సహచరులతో నిర్వహించిన సమావేశం ఉగ్రవాదుల దాడులను ఖండించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు , ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఇతర ప్రతినిధులతో జరిగిన సమావేశం ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

## తెలంగాణ టూరిస్టులను స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణకు చెందిన టూరిస్టులను సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున వారికి తగిన సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర పర్యాటక శాఖ అధికారులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులతో పాటు కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో ప్రయాణించిన పర్యాటకుల వివరాలు వెంటనే అందించాలని రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లను కోరినట్టు మంత్రి తెలిపారు. పర్యాటకుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు, అవసరమైన సమయంలో సహాయాన్ని అందించేందుకు ఉపయోగ పడుతుందని అన్నారు. అలాగే తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. కాశ్మీర్‌లో చిక్కుకున్న టూరిస్టుల సహాయం కోసం నిరంతరం సేవలందించేందుకు ఈ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకుల బంధువులు, స్నేహితులు కూడా తమ సమాచారం అందించేందుకు, లేదా సహాయం కోసం కింది హెల్ప్‌లైన్ నెంబర్‌లు 9440816071, 9010659333, 040 23450368 కు కాల్ చేయాలని కోరారు.

# ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- మహేశ్వరం నాగారం భూదాన్ భూముల్లో అక్రమాలు జరిగాయంటూ హైకోర్టులో పిటిషన్
- తదుపరి విచారణ జూన్ 26కు వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం పరిధిలోని భూదాన్ భూములకు సంబంధించిన వివాదంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ భూముల్లో అక్రమాలు జరిగాయని, పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్ పై న్యాయస్థానం విచారణ చేపట్టింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని స్పష్టం చేసింది. ప్రతివాదులుగా ఉన్న ప్రభుత్వంతో పాటు ఈడీ, సీబీఐ, పిటిషన్‌లో పేర్కొన్న అధికారులు, వారి కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసింది. మహేశ్ అనే వ్యక్తి ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. నాగారం గ్రామంలోని భూదాన్ భూములను కొందరు ఉన్నతాధికారులు తమ పలుకుబడిని ఉపయోగించి, చట్టవిరుద్ధంగా బినామీ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, వారి కుటుంబసభ్యులను ప్రతివాదులుగా చేర్చారు.

ఈ పిటిషన్‌పై జస్టిస్ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, భూదాన్ భూముల అక్రమాలపై ప్రభుత్వానికి, భూదాన్ బోర్డుకు గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ వ్యవహారంలో నిజానిజాలు తేలాలంటే సీబీఐ లేదా ఈడీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ఈ అంశంపై సమగ్ర విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. దర్యాప్తు జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వ్యాఖ్యానించారు. తక్షణమే వివాదాస్పద భూములపై ఎలాంటి క్రయవిక్రయాలు గానీ, ఇతర లావాదేవీలు గానీ చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను హైకోర్టు జూన్ 26వ తేదీకి వాయిదా వేసింది.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. విచారణ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవలే కంచ గచ్చిబౌలి భూములను టీజీఐఐసీకి కేటాయింపు, టీజీఐఐసీకి కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. అదేవిధంగా ఆ భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని కోరుతూ.. వట ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థతో పాటు మరో ముగ్గురు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఇవాళ ఆ పిటిషన్లపై విచారణ చేపట్టిన ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం కంచ గచ్చిబౌలి భూములకు సంబంధించి కేసు సుప్రీంకోర్టులో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయా పిటిషన్లపై విచారణను వేసవి సెలవుల తర్వాత వరకు వాయిదా వేస్తున్నట్లుగా న్యాయమూర్తి పేర్కొన్నారు.

# మహిళల కోసం 'ట్యూటెమ్' యాప్

- మహిళల భద్రత ప్రాధాన్యతతో రూపుదిద్దుకుంటున్న 'ట్యూటెమ్' యాప్
- త్వరలో నగర ప్రజలకు అందుబాటులోకి
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ నగరంలో ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సురక్షితమైన రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. ప్రజల భద్రత విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఆలోచనలు సాకారం చేసే దిశగా మెట్రో రైల్ అడుగులు ముందుకేస్తోందని ఆయన తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్, హైదరాబాద్ పోలీస్ సహకారంతో బిట్స్ పిలానీ- హైదరాబాద్ క్యాంపస్, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ బొంబాయి సంయుక్తంగా ఏడీబీ ఆర్థిక సహాయంతో ట్యూటెమ్ (టెక్నాలజీస్ ఫర్ అర్బన్ ట్రాన్సిట్ టు ఎన్హాన్స్ మొబిలిటీ అండ్ సేఫ్ యాక్సెసిబిలిటీ- ట్యూటెమ్) అనే ఒక కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశారనీ, యాప్ రూపంలో ఇది త్వరలో హైదరాబాద్ ప్రజలకు అందుబాటులోకి రాబోతుందన్నారు.

ఈ సందర్భంగా బిట్స్ పిలాని హైదరాబాద్ క్యాంపస్‌లో గురువారం జరిగిన యూజర్ వర్క్ షాప్‌లో ఎండీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మెట్రోలో ప్రయాణించే వారు ముఖ్యంగా మహిళలు తమ చిట్టచివరి గమ్యస్థానానికి భద్రంగా చేరడానికి ట్యూటెమ్ యాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ ఇంటి నుంచి గమ్యస్థానాల వరకు రాకపోకలు సాగించే ప్రక్రియలో ప్రయాణ పరంగా ఇబ్బందులు లేకుండా అనేక సౌకర్యాలు ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానంలో పొందుపరిచామని తెలిపారు. ఈ యాప్‌లో డ్రైవర్ యాప్, యూజర్ యాప్ అని రెండు భాగాలు ఉంటాయనీ, దీనిలో ప్రయాణీకులను.. ముఖ్యంగా మహిళా ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే అన్ని జాగ్రత్తలు పొందుపర్చాయని వివరించారు. ప్రయాణంలో సింహభాగం మెట్రో రైల్ ద్వారా జరిగితే మెట్రో రైల్ ప్రయాణానికి ముందు, తర్వాత ఇంటి వద్ద నుంచి చివరి గమ్యస్థానం వరకు కాలినడకన, ద్విచక్ర వాహనంపై కానీ కారు లేదా బస్సు లేదా ఆటో ద్వారా జరిగే ప్రయాణాన్ని కవర్ చేస్తూ ఈ యాప్ రూపొందించినట్టు చెప్పారు. ఒక వేళ దారిలో ఎక్కడైనా మహిళా ప్రయాణీకులకు అభద్రతా భావం ఏర్పడితే వారు వెంటనే పోలీస్ కంట్రోల్ సెంటర్‌ను, వారి ఇంటి వారిని, బంధువులను అప్రమత్తం చేసేలా సౌకర్యం ఉందని తెలిపారు. సామాజిక ఆర్థిక సమస్యల కు ఇంజినీరింగ్, సాంకేతికతలు పరిష్కారం చూపాలన్నది తమ అభిమతమని, అందుకు తగ్గట్టుగా కొత్త ఆవిష్కరణలకు తాము ఎప్పుడు ముందుంటామన్నారు.

బిట్స్ పిలానీ వీసీ ప్రొఫెసర్ వి. రామ్ గోపాల్ రావు మాట్లాడుతూ అర్ధరాత్రి సమయాల్లో మహిళలు సురక్షితంగా వారి గమ్యాలకు చేరడానికి ఈ 'ట్యూటెమ్' యాప్‌లో పలు సౌకర్యాలు పొందుపరిచామన్నారు. ఇది రాబోయే రోజుల్లో హైదరాబాద్‌తో పాటు దేశంలో ఇతర నగరాలకూ విస్తరించేలా తమ సంస్థ సాంకేతిక నిపుణులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీబీ ప్రతినిధి కుమారి జోసెఫిన్ ఎక్వినో, బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సౌమ్యో ముఖర్జీ, ఐఐటీ బొంబాయికి చెందిన ప్రొఫెసర్ అవిజిత్ మాజీ, బిట్స్ పిలానీ ప్రొఫెసర్ ప్రశాంత్ సాహు పాల్గొన్నారు.


## గగనతలం మూసివేసిన పాక్

- విమాన సర్వీసులపై ప్రభావం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించడం తెలిసిందే. ఈ అనూహ్య పరిణామంతో పలు అంతర్జాతీయ విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడవచ్చని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో, ఎయిరిండియా తమ ప్రయాణికులను అప్రమత్తం చేశాయి. విమానాలను ప్రత్యామ్నాయ, సుదీర్ఘ మార్గాల్లో మళ్లించాల్సి వస్తుందని, దీనివల్ల ప్రయాణ సమయం పెరిగే అవకాశం ఉందని ఆ సంస్థలు 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపాయి. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పౌరులు, పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ తీసుకున్న దౌత్యపరమైన చర్యలకు ప్రతిగా పాకిస్తాన్ గగనతల మూసివేత నిర్ణయం తీసుకుంది. వీసాల జారీని నిలిపివేయడం, సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం వంటి చర్యలను భారత్ ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్ తమ గగనతలాన్ని భారత విమానాలకు పూర్తిగా నిషేధించింది. ఎయిరిండియా విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఉత్తర అమెరికా, యూరప్, మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే కొన్ని విమానాలపై ఈ ప్రభావం పడనుంది. ఇండిగో కూడా ఇదే విధమైన ప్రకటన విడుదల చేసింది. ప్రయాణికులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, ఎయిర్‌పోర్టుకు బయలుదేరే ముందు తమ విమాన ప్రయాణ సమయాలను, షెడ్యూళ్లను తప్పనిసరిగా సరిచూసుకోవాలని రెండు సంస్థలూ ప్రయాణికులకు విజ్ఞప్తి చేశాయి.

# ఉగ్రవాదులను ఊహించని రీతిలో శిక్షిస్తాం



- ప్రధాని నరేంద్ర మోడీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ ముష్కరులకు ఊహించని రీతిలో శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని, వారిని మట్టిలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. ఇది పర్యటకులపై జరిగిన దాడి కాదని, భారత్ ఆత్మపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, వెంటాడి భారత్ హతమారుస్తుందని స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం బిహార్ మధుబనిలో పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న మోదీ, పహల్గాం ఉగ్రదాడిపై తొలిసారి మాట్లాడారు. ఉగ్రవాదులకు కలలో కూడా ఊహించని శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు.

కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని మోడీ తెలిపారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయిందని, ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరవయ్యాడని అన్నారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రతి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని మోదీ హెచ్చరించారు.

అదే సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు మిగితా 2వ పేజీలో

## హవాలా దందాపై ఈడీ దాడులు

- నగరంలోని పలు ప్రాంతాల్లో సోదాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని పలువురు హవాలా వ్యాపారుల ఇండ్లు, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం దాడులు చేశారు. గతంలో విదేశీ సిగరెట్ల స్మగ్లింగ్, ఫారిన్ కరెన్సీ, గుటా దందా ముసుగులో సాగుతున్న హవాలాపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు కేసు నమోదు చేశారు. అప్పట్నుంచీ నిఘా పెట్టిన ఈడీ అధికారులు.. మలక్‌పేట్, బేగంబజార్, సికింద్రాబాద్‌లోని 13 మందికి చెందిన వివిధ ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ దాడుల్లో భారీగా నగదు గుర్తించినట్టు తెలిసింది. ఫారిన్ సిగరెట్ల స్మగ్లింగ్‌లో భారీ మొత్తంలో మనీలాండరింగ్ జరుగుతున్నట్టు ఈడీ ఆధారాలు సేకరించిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

# ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్..

### ఐదుగురు మావోయిస్టులు హతం

**బలగం టీవీ, హైదరాబాద్**

ములుగు జిల్లాలోని తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భీమారంపాడు సమీపంలోని అటవీప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన భీకర పోరు ఐదుగురు మావోయిస్టులు మరణించారు.

మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మాతో పాటు దాదాపు 2500 మంది మావోయిస్టులు భీమారంపాడు సమీపంలోని కర్రగుట్టలో ఉన్నట్లు నిఘావర్గాలకు ఇటీవల సమాచారం అందింది. దీంతో కర్రగుట్ట అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు రెండు రోజులుగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టింది. అటవీ ప్రాంతం మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేయడంతో పాటు హెలికాప్టర్లతోనూ మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే తారసపడ్డ మావోయిస్టులపై కాల్పులు జరిపి ఐదుగుర్ని హతమార్చారు. ఈ కూంబింగ్ ఆపరేషన్ నేపథ్యంలో భీమారంపాడు గ్రామస్తులు ఎవరూ కూడా బయటకు రావద్దని భద్రతా బలగాలు హెచ్చరికలు జారీ చేశాయి.

### టీఆర్ఎస్ అయినా బీఆర్ఎస్ అయినా..

# దాని వాసన మట్టి వాసనే..





**బలగం టీవి, హైదరాబాద్**

25 ఏండ్ల టీఆర్ఎస్ తెలంగాణా రాష్ట్రాన్ని సాధించింది

పదేండ్ల కేసీఆర్ పాలన.. తెలంగాణా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చింది..

కేసీఆర్ అనే మూడు అక్షరాల పదమే లేకుంటే.. బక్కపలచని మనిషి.. తెలంగాణా రాష్ట్రం కోసం జెండా పట్టకపోతే..

నేటి పరిస్థితి తెలంగాణ ది సమైఖ్య ఆంధ్రాలో ఎలానో ఒక్కసారి ఆలోచన చేయాలి..

సాగునీరేమో కానీ తాగునీరు కరువు నాటి తెలంగాణాలో..

గుక్కెడు నీళ్ల కోసం గుక్కపట్టి ఏడ్చిన రోజులు.. వాటర్ ట్యాంకుల వద్ద, చేతిపంపుల వద్ద ఆడబిడ్డలు సికెంటుకలు పట్టుకొని కొట్టుకొని బిందెడు నీళ్ల కోసం పానిపట్టు యుద్ధాలు చేసిన రోజులవి..

కరెంటు కష్టాలు.. రైతన్నలు, నేతన్నలు, గీతన్నల ఆత్మహలిత్యలు..

కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడో పోతుందో తెలియని చీకటి రోజులు.. అర్ధరాత్రి కరెంటుకు పాముకాట్లకు రైతులు అసువులు బాసిన ఆ రోజులను ఇప్పటికి మరిచిపోలేను..

యూరియ బస్తా కోసం పోలీస్ స్టేషన్ల ముందు బారులు తీరి.. ప్రాణాలిడిసిన రైతులు..

నేను 23 ఏండ్లుగా జర్నలిస్టుగా రాజన్న సిరిసిల్ల లో వివిధ పత్రికల్లో పని చేసిన.. కరువు కటకాలు చూసిన.. అనుభవించిన.. ఆ వార్తాలను రాసిన..

తెలంగాణాకు ముందు, తెలంగాణ తర్వాత నేను బేరిజు వేసుకున్నాను. మన రాష్ట్రం మనం ఏలుకునే రోజులొచ్చాయి.. మన నాయకులు ఆంధ్రా నాయకుల వద్ద చేతులు కట్టుకొని ఐదు, పది లక్షల నిధుల కోసం అడిగే రోజులు పోయి మన పైసలు మనమే మంజూరు చేసుకునే రోజులొచ్చాయి. ఆత్మగౌరవం లభించింది.

ఎక్కడికో నేను పోను.. పదేండ్ల ముందు మా సిరిసిల్ల.. పదేండ్ల తర్వాత సిరిసిల్ల ను నేను అభివృద్ధికి కొలామానం వేస్తాను.

మెట్ట ప్రాంతమైన సిరిసిల్ల లో కరువుతో రైతున్నలు ఆత్మహలిత్యలకు పాల్పడితే.. ఉపాధీ కరువై గల్ఫ్ పట్టిన యువత.. వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో.. నేతన్నలు వందల సంఖ్యలో ప్రాణాలు తీసుకున్నారు.

కానీ తెలంగాణ రాష్ట్రం సిద్దించిన తర్వాత.. సిరిసిల్ల రూపు రేఖలు మారిపోయాయి. ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి.. తిన్న రేవు తలవాలి.. కేసీఆర్ తనయకుడు కేటీఆర్ సిరిసిల్ల ఎమ్మెల్యే కాకపోయింటే కూడా ఈ మాత్రం సిరిసిల్ల అభివృద్ది కాకపోవు అనుకుంటాను.

సిరిసిల్ల ఎటు చూసిన రెండు కిలో మీటర్లు పోడవు ఉండకపోవు కానీ ఇప్పుడు 10 కిలో మీటర్ల వరకు పట్టనం విస్తరించింది. ఎటు చూసిన బైపాస్‌రోడ్డులు,ఫోర్ లైన్లు, పరిశ్రమలు, ఇంజనీరింగ్, డిగ్రి, ఇంటర్ కళాశాలలు, మౌళిక వసతుల మెరుగు అయ్యాయి. బతుకమ్మ చీరలతో సిరిసిల్ల నేతన్నల ఆత్మహలిత్యలు నిలిచిపోయాయి. వారి జీవితాల్లో వెలుగులు నిండాయి. ప్రతి మనిషిలో కొనుగోలు శక్తి పెరిగింది.

కరువు ప్రాంతమైన సిరిసిల్ల కాళేశ్వరం జలాలతో.. మిడ్ మానేరు నిర్మాణం పూర్తితో శాస్యశామలం అయ్యింది. 9వ ప్యాకేజి పనుల పూర్తితో సిరిసిల్ల జిల్లా లో వేల ఎకరాలు భూమికి శాశ్వాత సాగునీరు అందనుంది.

తెలంగాణా ఏమొచ్చింది అంటే.. బానిస సంకెళ్లు పోయి .. ఆత్మగౌరవం వచ్చింది అని చెప్పాలి. స్వయం పాలన వచ్చిందని చెప్పుకొవాలి. సాగు, తాగునీరు కష్టాలు పోయినయి అని చెప్పాలి.. ఆత్మహలిత్యలు ఆగిపోయాయని చెప్పాలి. అన్ని రంగాల్లో అభివృద్ది చెందుతూ ప్రపంచ పటంలో మన తెలంగాణ వెలుగుతుందని చెప్పాలి. ఏ ప్రభుత్వం ఐన లోటు పాట్లు, మంచి చెడులు ఉండోచ్చు కానీ.. కేసీఆర్ అనే ఒక శక్తి.. తెలంగాణ జెండా పట్టకపోతే.. ఆంద్రాపెత్తందారి వ్యవస్థపై పోరు చేయకపోతే మన బతుకులు ఇంకా ఇలానే ఉండేవి.

కేసీఆర్ దగ్గరు దొరతనం ఉండోచ్చు.. కానీ దొర గుణం కూడా ఉందని చెప్పాలి. తెలంగాణా ఉన్నంత కాలం.. మూడు అక్షరాల పేరుగల కేసీఆర్.. చరిత్రపూటాల్లో చిరస్థాయి బతికి ఉంటాడు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో భావిభారత విద్యార్థులు ఒక జనరల్ నాలేడ్జ్ కొశ్చన్ అవుతాడు. కేసీఆర్ లోటును పూడ్చడం ఎవరితో సాధ్యం కాదనే నేను నమ్ముతాను.

కానీ కేసీఆర్ నమ్మిన సిద్దాంతాలను, తెలంగాణా ప్రయోజనాలను కాపాడే పార్టీ బీఆర్ఎస్ పార్టీయే.. ఈ పార్టీ ఒకరిద్దరిదో కాదు.. తెలంగాణా మట్టిన ప్రేమించే ప్రతి ఉద్యమకారుడిది.. టీఆర్ఎస్ ఐన బీఆర్ఎస్ ఐన.. దాని వాసన మట్టి వాసనే..

తెలంగాణాకు భౌవిష్యత్ నేత, కేసీఆర్ తర్వాత అంత విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్ గారే అని నేను భావిస్తాను.

నాయకత్వ లక్షణాలు, విజ్ఞానం, ఉన్నత చదువు ఉన్న కేటీఆర్ గారు అధికార పాత్రలోనే కాదు ప్రతిపక్ష పాత్రలో కూడా సక్సెస్ అవుతున్నారు. తెలంగాణా ప్రజల పక్షాన కొట్లాడుతున్నారు.



నేను ఒక జర్నలిస్టుగా కాకుండా.. తెలంగాణాకు ముందు.. తెలంగాణా తర్వాత మన బతుకుల గురించి అభివృద్ధి గురించే ప్రస్తావించాను. ఎందుకంటే నిజాలు మాట్లాడుకోవాలి కాబట్టి. బీఆర్ఎస్ 25 ఏండ్ల రజతోత్సవ సభ సందర్భంగా మనసులోని మాటలు మిత్రులతో పంచుకోవాలనిపించింది.

నోట్ : ఒకటి మాత్రం నిజం నాకు ఏ పార్టీలత సంబంధం లేదు.. మంచి చేసే నాయకులను మాత్రం అభిమానిస్తాను.. డైరక్ట్ గానే సపోర్ట్ చేస్తాను..మంచిని మంచి చెడును చెడు అంటాను. ఎవరు ఏం అనుకున్న నేను పట్టించుకోను.. నా మనసు ఏది చెబితే అదే మాట్లాడుతా.. నా వ్యక్తిగత అభిప్రాయాన్ని బాజాప్తా వ్యక్తపరుస్తా.

జై తెలంగాణా..జై జై తెలంగాణా???

**బాలు కాయితి సిరిసిల్ల**
**సీనియర్ జర్నలిస్టు, రాజన్న సిరిసిల్ల**
**బలగం టీవీ , సీఈవో**



# హెలికాప్టర్ ను విలాసాలకు వాడటం లేదు

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ ఎవరు?, జాతీయ అధ్యక్షుడు ఎవరో చెప్పాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కెటిఆర్‌కు దమ్ముంటే రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి పదవి తెచ్చుకోవాలని అని ఆయన సవాల్ విసిరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మాదిరిగా పిసిసి అధ్యక్షుడు అయిన రెండు సంవత్సరాల్లోనే ముఖ్యమంత్రి కావాలని ఆయన కెటిఆర్‌కు సూచించారు. దమ్ముంటే బిఆర్ఎస్ పార్టీలో బిసిని లేదా ఎస్సీని రాష్ట్ర అధ్యక్షుడిగా చేయాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ మాదిరిగా విలాసాలకు హెలికాప్టర్ వాడే అలవాటు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని తమలాగా సొంత హెలికాప్టర్ కాంగ్రెస్‌కు లేదని అద్దంకి దయాకర్ అన్నారు. రెండు, మూడు కార్యక్రమాలు ఉంటే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా హెలికాప్టర్ వాడుతున్నారని ఆయన తెలిపారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభ అని పెడుతున్నారని అవి బిఆర్ఎస్ రజతోత్సవాలా? లేక టిఆర్ఎస్ రజతోత్సవాలా? చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పుట్టి 3ఏళ్లు, టిఆర్ఎస్ కనుమరుగై మూడు ఏళ్లు అయ్యిందని ఈ రజతోత్సవాలు దేనికి సంబంధించినవో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్‌ను జనతా గ్యారేజీగా భావించి సమస్యలు చెప్పుకోవడానికి ప్రజలు వస్తున్నారని కెటిఆర్ అంటున్నారని, జనతా గ్యారేజీలో ఓనర్ కొడుకు విలన్ అని, మీ జనతా గ్యారేజీలో కెటిఆర్ విలనా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ పిలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని కెటిఆర్, హరీష్ రావు, కవితలు ప్రజలకు కట్టుకథలు చెబుతున్నారని, మరీ కెసిఆర్ బయటకు వచ్చి పిట్ట కథలు చెబుతారా అని ఆయన ఎద్దేవా చేశారు.

# కేసీఆర్‌ను చూడడానికి జనం ఎదురుచూస్తున్నారు

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

**బలగం టీవి, హైదరాబాద్**

ముక్కు సూటిగా మాట్లాడి మాస్ లీడర్‌గా తనకంటూ ఓ ప్రత్యేక ఖ్యాతిని సంపాదించుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ కమ్యూనిటీ హాలులో జలమండలి, ఇతర అధికారులు, పారిశుధ్య కార్మికులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌ను చూడాలని ప్రజలు ఎప్పటినుంచో ఆశగా ఎదురు చూస్తున్నారని కావున 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ సభకు జనం భారీగా వస్తారని భావిస్తున్నట్టు తెలిపారు. తాను తన అభిప్రాయాన్ని మాత్రమే చెబుతున్నానన్నారు.

అలాగే కంచ గచ్చిబౌలి భూముల విషయంలో ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ వాస్తవాన్నే రీట్వీట్ చేశారని అందులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేసినట్లు తను భావించడం లేదని చెప్పారు. ఇదిలా ఉండగా గతంలోనూ దానం చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇరకాటంలో నెట్టాయి.ముఖ్యంగా హైడ్రా తీరును బాహాటంగానే విమర్శిస్తూ, రెక్కాడితే గానీ డొక్కాడని వారిపై ప్రతాపం చూపడం సబబు కాదని, అవసరమైతే కూల్చివేతల వద్ద నిరసనకు కూర్చుంటానని హెచ్చరించారు. తాజాగా బీఆర్ఎస్ సభపై మాట్లాడటం మరింత చర్చనీయాంశంగా మారింది.

# ఉగ్రవాదులను ఊహించని రీతిలో శిక్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదంతో భారత ఐకమత్య స్ఫూర్తిని బద్దలుకొట్టలేరని మోదీ స్పష్టం చేశారు. ఏప్రిల్ 22న పహల్గాంలోని ప్రముఖ పర్యటక ప్రాంతమైన బైసరన్‌లో ముష్కరులు జరిపిన దాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన వారు పర్యటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు ముష్కరులు.

# ముస్లింలకు ఓవైసీ పిలుపు

**బలగం టీవి, హైదరాబాద్**

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలకు కీలక పిలుపునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఖండిస్తున్నామనే సందేశాన్ని పంపడానికి శుక్రవారం మసీదులకు ప్రార్థనలకు వెళ్లే సమయంలో ముస్లింలు తమ చేతులకు నల్ల రిబ్బన్ లేదా బ్యాండ్ ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

“నిఘా వైఫల్యమేనని.. ఇలా చేయడం ద్వారా విదేశీ శక్తులు భారతదేశ శాంతి, ఐక్యతను బలహీనపరచనివ్వబోమని మనం భారతీయులందరికీ సందేశం పంపుదాం అంటూ అసదుద్దీన్ ఒవైసీ హిందీలో ట్వీట్ చేశారు. ఇప్పటికే పహల్గాం ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించిన విషయం తెలిసిందే. మతం పేరుతో ప్రాణాలు తీయడం దారుణమని వ్యాఖ్యానించారు. అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ఉగ్రవాద గ్రూపులకు ఆశ్రయం కల్పించే దేశంపై కేంద్ర ప్రభుత్వం ఏ చర్య అయినా తీసుకోవచ్చు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ఆత్మరక్షణ కోసం వైమానిక, నావికా దిగ్బంధనం చేయడానికి, ఆయుధ అమ్మకాలపై పాకిస్తాన్‌పై ఆంక్షలు విధించడానికి అంతర్జాతీయ చట్టం కూడా అనుమతిస్తుందని పేర్కొన్నారు. బైసారన్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్‌ని ఎందుకు మోహరించలేదు? అని ఒవైసీ ప్రశ్నించినట్టు తెలిపారు.



## స్వీయ రక్షణకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

**బలగం టీవీ, సిరిసిల్ల:**

స్వీయ రక్షణ కోసం ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే సిబ్బంది కి ఎస్పీ మహేష్ బి. గితే హెల్మెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ నిత్యా విధులలో బిజీగా ఉండే పోలీస్ అధికారుల,సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని,విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండు విధులు నిర్వహించాలని,అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని డ్యూటీలు నిర్వహించే సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలనిఅన్నారు.ఇక్కడ సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, గ్రిహుమ్ హౌసింగ్ ఫైనాన్స్ యాజమాన్యం , సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి..

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**బలగం టీవీ, వేములవాడ**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.. గురువారం ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో వేములవాడ లోని మైనార్టీ గురుకుల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థులు హేమంత్ వోకేషనల్ ఏంఎల్టీ మొదటి సంవత్సరంలో 496 మార్కులతో రాష్ట్ర మొదటి ర్యాంకు,ఆదిల్ షరీఫ్ ఎల్ఎండిటి లో 500 కు గాను 483 తో రాష్ట్ర రెండవ ర్యాంకు, ద్వితీయ సంవత్సరంలో 900 మార్కులకు పైగా సాధించిన 16 మంది విద్యార్థులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మొదటి,రెండవ ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు.. ప్రజా ప్రభుత్వంలో విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని,ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, ఐటిఐలు, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.. గత పది సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా గురుకులాల్లో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందని పేర్కొన్నారు.. విద్యార్థులు రానున్న రోజుల్లో తమపై చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు నమ్మకాన్ని వమ్ము చేయకూడదని సూచించారు.. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, లెక్చరర్స్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు...



## రజతోత్సవ సభ ప్రాంగణాన్ని పరిశీలించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె

**బలగం టీవీ, బోయినిపల్లి**

బీఆర్ఎస్ పార్టీ 27వ రజతోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో జరుగనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వరంగల్ ఎల్కతుర్తిలో గురువారం రోజున చొప్పదండి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో కలిసి పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా సుంకె మాట్లాడుతూ: బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఓ చారిత్రక ఘట్టంగా మిగలాలన్నారు. ఊరు, వాడ దండులా కదిలి, సభను జయప్రదం చేయాలన్నారు.ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ సభతో కాంగ్రెస్‌లో వెన్నులో వణుకుపుట్టాలన్నారు. ఈ సభ కార్యక్రమంలో మండల మాజీ కోప్షన్ సభ్యులతోపాటు టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## పెండింగ్ సాదా బైనామాలకు భూ భారతితో పరిష్కారం

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**
**బలగం టీవీ,, సిరిసిల్ల**




పెండింగ్ సాదా బైనామా దరఖాస్తులు నూతన ఆర్వోఆర్ చట్టం భూ భారతితో పరిష్కారం అవుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని అన్నారు.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు.

భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం పై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని అన్నారు.

అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ కొమిరిశెట్టి విజయ, తహసీల్దార్ మారుతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రైతులు ఆందోళన చెందవద్దు..

రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో షెడ్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా షెడ్లలో ధాన్యం నిల్వ చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తెలిపారు.

### కొనుగోలు కేంద్రాల తనిఖీ.

గంభీరావుపేట మండలం ముస్తాఫా నగర్, దేశాయిపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తనిఖీ చేశారు. ప్రతీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలింపు నిమిత్తం రెండు వాహనాలు కేటాయించామని తెలిపారు. జిల్లాలో ధాన్యం తరలించడానికి వాహనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు.రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో హమాలీలు పని చేయాలని పేర్కొన్నారు.

## పోలీస్ సంక్షేమానికి పోలీస్ శాఖ కట్టుబడి ఉంది..

**-ఎస్పీ మహేష్ బి.గితే**
**బలగంటీవీ, రాజన్న సిరిసిల్ల**



శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ , ఆర్మడ్ పోలీస్ సిబ్బంది పాత్ర కీలకమని అట్టి సిబ్బంది సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రఖ్యాత మానసిక నిపుణులు డాక్టర్ అశోక్ కుమార్ అండ్ టీం చే మానసిక ఆరోగ్య అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై మాట్లాడుతూ.సిబ్బంది అధికారుల మానసిక స్థితి ,మానసిక ఆరోగ్యం కాపాడటం అనేది తక్షణ అవశ్యకతగా గుర్తించి రాష్ట్ర డిజిపి జితేందర్ ఆదేశాలమేరకు జిల్లా పొలిస్ అధికారులకు,సిబ్బందికి మానసిక ఆ అగహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీస్ సిబ్బందికి శాఖపరమైన, వ్యక్తిగత సమస్య వుంటే ఉన్నతాధికారుల దృష్టి కి తీసుకరవలని ఆయా సమస్యల పరిష్కరనికి కృషి చేయడం జరుగుతుందన్నారు.వ్యక్తిగత సమస్యలకు గురై ఒంటరిగా ఉన్నామనే భావన నుండి బయటకు రావాలని మీ భద్రత,ఆరోగ్యం మాకు ముఖ్యమైనవి అని సిబ్బందికి భరోసా కల్పించారు.ప్రతి ఒక్కరు మానసిక పరిపక్వత కలిగి ఉండాలని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులు ప్రతి నెల సిబ్బందితో సమావేశా లు నిర్వహించి వారి సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకోవలన్నారు.తాత్కాలిక ఆనందాల కోసం ప్రాణాలను,కుటుంబ సభ్యులను ప్రమాదంలో పెట్టవద్దని అధికారులు, సిబ్బంది విరామ సమయంలో కుటుంబలతో గడపాలని తెలిపారు.

మహిళ సిబ్బందికి సంక్షేమం కోసం అన్ని రకాల చర్యలు చేపట్టడం జరుగుతుందని,మహిళ సిబ్బందికి అన్ని రకాల అండగా ఉంటామని అన్నారు. జిల్లా పోలీస్ శాఖ జిల్లా సిబ్బంది సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు(అధికారులకు, సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఉచిత ఆరోగ్య శిబిరాలు,యోగ తరగతులు, క్రీడలు...చేపడుతు సిబ్బందిలో నూతనోత్సాహం నింపడం జరుగుతుందన్నారు.

నిత్యం యోగ,వ్యాయామం లాంటివి అలవాటు చేసుకోవడం ద్వారా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటూ ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదురుకోవచ్చని అధికారులకి,సిబ్బందకి సూచించారు.. పిలువగానే వచ్చి జిల్లా అధికారులకు, సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించిన రాష్ట్ర ఆత్మహత్యలు నివారణ సంస్థ టీమ్ సబ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,ఆత్మహత్యలు నివారణ సంస్థ చైర్మన్ డాక్టర్ అశోక్, సభ్యులు రామకృష్ణ ,సైకాలజిస్ట్ లు శైలజ,రామోజిరావు, బోడా అరుణ,సి.ఐ మొగిలి, మధుకర్, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు రమాకాంత్, రామ్మోహన్, ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్, ఆర్.ఎస్.ఐ లు శ్రవణ్, సాయి కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే మండపంలో ఇద్దరిని వివాహం చేసుకున్న యువకుడు

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఒక యువకుడు ఒకే వేదికపై ఇద్దరు యువతులను ఏకకాలంలో పెళ్లాడాడు. జైనూర్ మండలం అడ్డెసర గ్రామానికి చెందిన రంభ బాయ్, బద్రుషావ్ దంపతుల కుమారుడు ఛత్రుషవ్, అదే గ్రామంలోని పూనగూడకు చెందిన జంగుబాయిని, ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన సోమ్‌దేవిని ఒకే ముహూర్తానికి, ఒకే మండపంలో వివాహం చేసుకున్నాడు. ఈ వివాహానికి ఇద్దరు అమ్మాయిల కుటుంబ సభ్యులు సమ్మతి తెలిపారు.

## 'చెయ్యని పనుల బిల్లుల కోసం వేధింపులకు గురిచేసిండ్రు'

**బలగం టీవీ, సిరిసిల్ల**

చేయని పనులకు బిల్లుల కోసం వేధింపులకు గురి చేశారని గ్రామ కార్యదర్శి మంత్రి ప్రియాంక అన్నారు. రెండు రోజుల క్రితం తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన గ్రామ కార్యదర్శి మంత్రి ప్రియాంక మిస్సింగ్ కలకలం రేపింది. తిరుపతిలో ఆచూకీ తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షేమంగా సిరిసిల్ల కి తీసుకు వచ్చినారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూగ్రామంలో నలుగురు వ్యక్తులు గుగ్గిళ్ళ శ్రీకాంత్, గుగ్గిళ్ళ అభి,మల్లేష్,రాజు వీరి వేధింపుల కారణంగానే రాజీనామా పంపించి వెళ్ళిపోయఅని, అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక పరిష్కారం మాత్రమే చూపారని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాలో అనర్హుల పేర్లను ప్రకటించాలని ఒత్తిడి చేశారని అన్నారు. మహిళ అని కూడా చూడకుండా ఏకవచనంతో దురుసుగా మాట్లాడారని,ఎంపిడివో కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని,అధికారులు కూడా వారికే వత్తాసు పలికారని అన్నారు. వేధింపులు భరించలేకే రాజీనామా పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపించి వెళ్ళపోయానని,ఆంధ్రప్రదేశ్ లోనే వేరే ఉద్యోగం చూసుకొని కుటుంబ సభ్యులకు చెబుదామనుకున్న అని అన్నారు.ట్రేసింగ్ ద్వారా తెలుసుకొని కుటుంబ సభ్యులు నన్ను తిరిగి తీసుకొచ్చారని,కుటుంబ సభ్యులతో చర్చించి తర్వాత కార్యాచరణ రూపొందించుకుంటని తెలిపారు.

# పోరాడి ఓడిన రాజస్థాన్ రాయల్స్



- 11 పరుగులు తేడాతో ఆర్సీబీ గెలుపు
- ఈ సీజన్‌లో తొలిసారి హెూంగ్రౌండ్ చిన్నస్వామి స్టేడియంలో గెలిచిన బెంగళూరు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఆసక్తికర పోరులో రాజస్థాన్ రాయల్స్‌ను 11 పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఓడించింది.206 పరుగుల భారీ లక్ష్యంతో మైదానంలోకి దిగిన రాజస్థాన్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగుల వద్దే నిలిచింది. సొంత స్టేడియంలో వరుసగా మూడు ఓటముల తర్వాత.. ఇప్పుడు రాజస్థాన్ రాయల్స్ పై గెలుపొందింది.

బెంగళూరు స్టేడియం వేదికగా జరిగిన మ్యాచులో టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ఆర్సీబీ.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (42 బంతుల్లో 70, 8 ఫోర్లు, 2 సిక్సులు), కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (27 బంతుల్లో 50, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) వరుసగా రెండో మ్యాచ్‌లోనూ హాఫ్ సెంచరీలు బాదారు. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (23 బంతుల్లో 26, 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆఖర్లో జితేశ్ శర్మ (10 బంతుల్లో 20లిబీ 4 ఫోర్లు), టిమ్ డేవిడ్ (15 బంతుల్లో 23బీ 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ బౌలర్లలో సందీప్ శర్మ 2 వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్, వానిందు హసరంగ చెరో వికెట్ తీశారు.

206 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 194 మాత్రమే చేసింది. హెజిల్ వుడ్ 4 వికెట్లు తీసి రాజస్థాన్ పతనం శాసించాడు. రాజస్థాన్ బ్యాటర్లలో యశస్వి జైశ్వాల్ 19 బంతుల్లో 257 స్ట్రైక్ రేటుతో 7 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో 49 పరుగులు మంచి శుభారంభం అందించాడు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 12 బంతుల్లో 2 సిక్సుల సాయంతో 16 పరుగులు చేశాడు. దూకుడు మీదున్న నితీశ్ రానా (22 బంతుల్లో 28బీ 3 ఫోర్లు, 1 సిక్స్), రియాన్ పరాగ్ (10 బంతుల్లో 22బీ 2 ఫోర్లు, 2 సిక్సులు) కృనాల్ పాండ్య దెబ్బతీశాడు. అనంతరం సిమ్రాన్ హెట్మెయర్ ను (11) ఔట్ చేసి మ్యాచును ఆర్సీబీ వైపు తిప్పాడు హెజిల్ వుడ్. ధ్రువ్ జురెల్ (47), శుభమ్ దూబె (12) పరుగులు చేశారు.

ఆఖరి రెండు ఓవర్లలో రాజస్థాన్ రాయల్స్ విజయానికి 18 పరుగులు అవ్వసరమవ్వగా.. హేజిల్ వుడ్ 19వ ఓవర్లో కేవలం ఒక పరుగే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. చివరి ఓవర్లో 17 పరుగులు కావాల్సిన నేపథ్యంలో యశ్ దయల్ వికెట్ పడగొట్టి కేవలం 5 పరుగులే సమర్పించుకున్నాడు. మొత్తంగా ఆర్సీబీ బౌలర్లలో హేజిల్ వుడ్ 4 వికెట్లు తీయగా.. కృనాల్ పాండ్య 2, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

# పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడం

- బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా



**బలగం టీవి, హైదరాబాద్**

పహల్గాంలో ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నది. పాకిస్తాన్‌తో ఇకపై ఎలాంటి ద్వైపాక్షిక ఆడబోదని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పష్టం చేశారు. అయితే 2012-13 నుంచి భారత్-పాకిస్తాన్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లో జరుగడం లేదు. చివరిసారిగా 2008లో బారత జట్టు పాకిస్తాన్‌లో పర్యటించింది. ప్రస్తుతం ఐసీసీ, ఏసీసీ టోర్నమెంట్‌ల సమయంలో మాత్రమే ఇరుజట్లు తలపడుతున్నాయి. ఇక పాకిస్తాన్ చివరిగా 2023 వన్డే ప్రపంచకప్ సందర్భంగా భారత్‌ను సందర్శించింది. అయితే, 2025 చాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్‌కు వెళ్లేందుకు భారత్ నిరాకరించింది. ఈ తర్వాత భారత జట్టు మ్యాచులన్నీ దుబాయి వేదికగా జరిగాయి. ఓ స్పోర్ట్స్ సంస్థతో రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. హహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. తమ ప్రభుత్వం ఏది చెప్పినా చేస్తామన్నారు. ప్రభుత్వ వైఖరిని దృష్టిలో పెట్టుకొని పాకిస్తాన్‌తో సిరీస్‌లు ఆడడం లేదని.. భవిష్యత్‌లోనూ పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక మ్యాచులు జరుగవన్నారు. ఐసీసీ ఈవెంట్లలో మాత్రం ఆడాల్సి వస్తుందన్నారు. అయితే, ఏం జరుగుతుందో ఐసీసీకి తెలుసునని.. వారు సైతం సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు.

## ఉగ్రదాడిలో పాక్‌కు సంబంధం లేకపోతే ఎందుకు ఖండించలేదు..?

- పాకిస్తాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా



**బలగం టీవి, హైదరాబాద్**

పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ పాత్ర నిజంగా లేకపోతే ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎందుకు ఖండించలేదని పాకిస్తాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా ప్రశ్నించాడు. దాడి తర్వాత పాక్ దళాలు అకస్మాత్తుగా ఎందుకు అప్రమత్తమయ్యాయిని నిలదీశాడు. పాక్ ప్రభుత్వం ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, పెంచి పోషిస్తుందని ఆరోపించాడు. ఇది సిగ్గుపడాల్సిన విషయమని ఎక్స్ వేదికగా పాక్ ప్రభుత్వంపై అసహనాన్ని ప్రదర్శించాడు. దీనికి ముందు కూడా కనేరియా ఓ ట్వీట్ చేశాడు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు స్థానిక కశ్మీరీలను ఎందుకు టార్గెట్ చేయరని ప్రశ్నించాడు. హిందువులే లక్ష్యంగా ఎందుకు దాడులకు తెగబడతారని నిలదీశాడు. ఉగ్రవాదం కారణంగా యావత్ ప్రపంచం మూల్యం చెల్లించుకుంటుందని వాపోయాడు. తాజాగా కనేరియా మరో ట్వీట్ కూడా చేశాడు. నేను ఏదైనా ట్వీట్ చేసినప్పుడల్లా కొంతమంది భారతీయ ముస్లింలు ఎందుకు బాధపడతారని ప్రశ్నించాడు.

44 ఏళ్ల కనేరియా పాక్ తరపున క్రికెట్ ఆడిన రెండో హిందు ఆటగాడు. గతంలో అతని కజిన్ అనిల్ దల్‌పత్ పాక్‌కు ప్రాతినిధ్యం వహించాడు. కనేరియా 2000-2019 మధ్యలో పాక్ తరపున 61 టెస్టులు ఆడి 261 వికెట్లు పడగొట్టాడు. 18 వన్డేల్లో 15 వికెట్లు తీశాడు. కనేరియా హిందువన్న కారణంగా పాక్ క్రికెట్‌లో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. అతను టీమ్‌లో ఉండటం చాలామంది పాక్ క్రికెటర్లకు నచ్చేది కాదని ఆ దేశ మాజీ ఫాస్ట్ బౌలర్ షోయబ్ అక్తర్ స్వయంగా చెప్పాడు. అయితే కనేరియా స్పాట్ ఫిక్సంగ్ కేసులో జీవితకాల నిషేధాన్ని ఎదుర్కొంటున్నాడు.

# కష్టపడటంతో పాటు సరైన దృక్పథం కలిగించాలి

- మెగాస్టార్ చిరంజీవి

**బలగం టీవి, హైదరాబాద్**

జీవితంలో విజయం సాధించడానికి కష్టపడటంతో పాటు సరైన దృక్పథం కలిగి ఉండటం అత్యంత కీలకమని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరైన 'మైండ్‌సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. మంత్రి పొంగూరు నారాయణ కుమార్తె, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోడలు డాక్టర్ శరణి ఈ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రస్తావించిన మానసిక దృక్పథంలో మార్పు అనే అంశం చాలా ముఖ్యమైనదని ఎర్కొన్నారు. చాలామంది కష్టపడతారని, అయితే ఆ కష్టం సరైన దిశలో, స్మార్ట్‌గా ఉందా లేదా అన్నది ఫలితాన్ని నిర్ధారిస్తుందని వివరించారు. సరైన అవగాహన, మార్గనిర్దేశం లేకపోవడం వల్ల చాలామంది ఒకే రకమైన గానుగెద్దు జీవితాన్ని గడుపుతారని అభిప్రాయపడ్డారు. శరణి వంటి వారు రాసే పుస్తకాలు, గురువుల మార్గదర్శకత్వం లేదా స్వీయ అవగాహన ద్వారా ఈ పరిస్థితి నుంచి బయటపడొచ్చని సూచించారు. తమకు ఇష్టమైన రంగంలో కృషి చేస్తే వచ్చే ఫలితాలు, ఎదిగే స్థాయి వేరుగా ఉంటుందని ఆయన అన్నారు.



వ్యక్తిత్వ వికాసం, సానుకూల దృక్పథం వంటి అంశాలపై తనకు ఎప్పటినుంచో ఆసక్తి ఉందని చిరంజీవి తెలిపారు. దశాబ్దాల క్రితం తాను 'ది సీక్రెట్' వంటి పుస్తకాల ద్వారా ఈ విషయాలు తెలుసుకున్నానని, వాటిని ఆచరించడం వల్ల తనకు ఎంతో మేలు జరిగిందని గుర్తుచేసుకున్నారు. తన నేపథ్యం గురించి మాట్లాడుతూ, తాను సాధారణ కుటుంబం నుంచి వచ్చానని, తల్లిదండ్రులకు కూడా తన భవిష్యత్తుపై మార్గనిర్దేశం చేసేంత అవగాహన లేని పరిస్థితుల్లో స్వయంకృషితో పైకి వచ్చానని పరోక్షంగా సూచించారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి తనను ఆహ్వానించిన రచయిత్రి శరణి కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా మంత్రి నారాయణకు, గంటా శ్రీనివాసరావుకు చిరంజీవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న యువత, విద్యార్థులను చూసి దేశ భవిష్యత్తు వారి కళ్ళల్లో కనిపిస్తోందని అన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మీనాక్షి చౌదరి

**బలగం టీవి, హైదరాబాద్**

టాలీవుడ్ ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయానికి చేరుకున్న నటికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల నటిని చూసిన భక్తులు ఆమెతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు.

## 'మా సినిమా స్టోరీ గెస్ చేస్తే రూ. 5 లక్షలు'

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు సాయి తేజస్విని ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ఎర్రచీర. సుమన్ బాబు స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో ఒక కీలక పాత్రలోనూ ఆయన నటించారు. నేడ విడుదల కావాల్సిన ఈ సినిమా పలు సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. ఈ విషయాన్ని సినిమా డైరెక్టర్, నిర్మాత సుమన్ బాబు వెల్లడించారు. వేసవి కానుకగా మే రెండో వారంలో ఎర్రచీర సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. సుమన్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. ఈసినిమా చూసి బయటకు వెళ్లే ప్రేక్షకులు కన్నీళ్లు పెట్టుకుని బయటికి వెళ్తారని అన్నారు. సెన్సార్ బోర్డు సభ్యులు కూడా సినిమా చూసి అభినందించారని చెప్పారు. ఈ ప్రెస్‌మీట్ సందర్భంగా ప్రేక్షకులకు నిర్మాత సుమన్‌బాబు ఒక కాంటెస్ట్ పెట్టారు. సినిమా రిలీజ్‌కు ముందే స్టోరీని గెస్ చేస్తే ఐదు లక్షల ప్రైజ్ మనీ ఇస్తామని ప్రకటించారు. స్టోరీని అంచనా వేసిన వారు 80192 46552 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి చెప్పాలని.. విజేతకు ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రూ.5లక్షలు ఇస్తామని తెలిపారు.

# నేను పాకిస్థానీ కాను

- 'ఫౌజీ' హీరోయిన్ ఇమాన్వి

**బలగం టీవి, హైదరాబాద్**



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి ఘటనతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. అయితే, ఈ వ్యతిరేకత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ' చిత్ర హీరోయిన్ ఇమాన్వి వరకు వెళ్లింది. ఇమాన్వి తండ్రి మాజీ పాకిస్థానీ మిలిటరీ అధికారి అని.. ఆమె ఇండియన్ సినిమాలో నటించకూడదని పలువురు సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు. దీంతో ఈ వార్త ఆమె వరకు చేరింది. దీంతో ఆమె తాజాగా ఈ వివాదంపై క్లారిటీ ఇచ్చింది. తన తండ్రి పాకిస్థానీ మాజీ అధికారి అనే వార్త పూర్తిగా అవాస్తవం అని పేర్కొంది. తన తల్లిదండ్రులు ఇండో-అమెరికన్స్ అని.. తాను పుట్టింది లాస్ ఏంజిల్స్‌లో అని ఆమె వివరించింది. తనకు పాకిస్థాన్ నుంచి ఎలాంటి సంబంధం లేదని.. తాను పాకిస్థానీ కాదంటూ ఆమె చెప్పుకొచ్చింది. తాను గుజరాతీ, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలను మాట్లాడగలనని.. చదువు పూర్తయిన తర్వాత ఆర్ట్స్ నేర్చుకున్నానని ఆమె తెలిపింది. ఇండియన్ సినిమాలో భాగం అవుతున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందని.. దయచేసి తనపై తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఆమె కోరారు.